క్లుప్తంగా

18 మంది విద్యార్థులు గైర్హాజరు

సింగరాయకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి రామారావు తెలిపారు. బయాలజీ సైన్స్ పరీక్షకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 105 మంది విద్యార్థులు రావాల్సి ఉండగా 87 మంది హాజరయ్యారు.

మద్యానికి బానిసలు కావద్దు


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

సింగరాయకొండ: మద్యానికి బానిసలై అనారోగ్యం పాలు కావద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహిద్దీన్ విజ్ఞప్తి చేశారు. స్థానిక బాలయోగినగర్‌లో శనివారం మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్యపానం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయో ప్రజలకు వివరించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎర్ర వెంకట్, సీఐ ఎం శివకుమారి, సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చైతన్యకృష్ణ పాల్గొన్నారు.

ఓటుకు ఆధార్ నమోదు తప్పనిసరి

హనుమంతునిపాడు: ఓటుకు ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయాలని తహసీల్దార్ ఎం దిలీప్‌కుమార్ అన్నారు. బూత్‌లెవల్ అధికారులకు ఆధార్ నమోదుపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 23,400 ఓట్లు ఉంటే 22,066 ఓట్లు ఫీడింగ్ పూర్తయిందని, మిగిలిన ఓటర్లకు నమోదు చేయాలన్నారు. ఆర్ఐ క్రిష్ణ చైతన్య, వీఆర్వోలు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు లక్ష్మీఅలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

సౌకర్యాలు లేక సతమతం

- రాజుపాలెం పీహెచ్‌సీలో కరువైన వసతులు
- ఊడిపోతున్న గోడ పెచ్చులు
- అలంకారప్రాయంగా మరుగుదొడ్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


తుప్పపట్టిన ఇనుప మంచాలు


కాన్పుల గదిలో గోడల నుంచి టైల్స్ ఊడిపడుతున్న దృశ్యం

మర్రిపూడి: కూటమి ప్రభుత్వంలో వైద్య రంగంపై అలివిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఆస్పత్రుల నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో గ్రామాల్లోని పీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న చిన్న మరమ్మతులు సైతం చేయకపోవడంతో గ్రామీణ ప్రాంత రోగులు పడే కష్టాలు చెప్పేవీ కావు. మండలంలోని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆస్పత్రి పరిధిలో అంకేపల్లి, గార్లపేట, మర్రిపూడి, కూచిపూడి సబ్ సెంటర్లు ఉన్నాయి. మర్రిపూడి ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నారు. ప్రతి రోజు 60 నుండి 70 మంది రోగులు వైద్యపరీక్షలు చేయించుకుంటారు. గర్భిణులు సైతం కాన్పులు చేయించుకుంటారు. అయితే మౌలిక వసతులు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. పీహెచ్సీలో హెచ్‌వీ ఒక పోస్టు, ఎఫ్ఎన్ఓ మరో పోస్టు ఖాళీగా ఉన్నాయి. మౌలిక వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకునేదెవరు..?

ఈ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చుట్టుపక్కల గ్రామాలైన గంగపాలెం, దుగ్గిరెడ్డిపాలెం, పొట్టిరెడ్డిపాలెం, మర్రిపూడి, అంకేపల్లి, కూచిపూడి, చెంచిరెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలు వస్తుంటారు. అయితే రోగులకు సరిపడిన మరుగుదొడ్లు లేవు. దీంతో రోగులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాలలో ఉన్న మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో అవి నిరుపయోగంగా అలంకార ప్రాయంగా ఉన్నాయి. మంచాలు కూడా మరమ్మతులకు గురయ్యాయి. మంచాలపై ఉండే పరుపులు ఎప్పటివో కావడంతో రోగులకు సౌకర్యంగా ఉండటం లేదు. ముఖ్యంగా కాన్పుల గదిలో గోడకు అంటించిన టైల్స్ ఊడి పడిపోవడంతో ఆ విభాగాన్ని పక్క రూంకు మార్చారు. కాన్పుల గదిని కంప్యూటర్ రూంగా వాడుకుంటున్నారు. కంప్యూటర్లు ఏర్పాటు చేసుకున్న ఈ గదిలోని టైల్స్ ఒక్కొక్కటిగా ఊడిపోయి కింద పడిపోతున్నాయి. ఏ సమయంలో టైల్స్ తమ పడిపోతాయోనని సిబ్బంది ఆందోళనకు గురౌతున్నారు. పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న సమావేశపు గది గోడలు బీటలు వారాయి. ఆపరేషన్‌కు సంబంధించిన పరికరాలు మర్రిపూడి పీహెచ్‌సీలో అందుబాటులో లేకపోవడంతో రోగులను చికిత్స నిమిత్తం పొదిలి, ఒంగోలు తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. పీహెచ్‌సీలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, మంచాలు, మరుగుదొడ్లు మరమ్మతులు చేయించాలని రోగులు కోరుతున్నారు.

జగనన్న పోరుబాటను జయప్రదం చేద్దాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్


మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: పొగాకు రైతుకు అండగా ఈ నెల 28న పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. జగనన్న పోరుబాట కార్యక్రమంపై స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఒక్క రైతు కూడా తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని, ముఖ్యంగా పొగాకు, మిరప, కంది, వరి ఇలా ఏ ఒక్క రైతూ ఆనందంగా లేడన్నారు. పొగాకు రైతు పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేజీ ధర రూ.360 వరకు ధర వస్తే నేడు రూ.200 నుంచి రూ.280 మాత్రమే ఉందన్నారు. భారీగా పెరిగిన పెట్టుబడులకు ధరలను పెంచాల్సింది పోయి ఇష్టం వచ్చినట్లు తగ్గించడంతో రైతులు ఆత్మహత్యలే శరణ్యమంటున్నారన్నారు. ఇటీవల ఒంగోలులో జరిగిన డీఆర్‌సీలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు పొగాకు రైతుల కష్టాలపై ప్రశ్నిస్తే కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు, మంత్రులు కప్పదాటు విధానాన్ని అవలంబిచారని ఆరోపించారు.

నిత్యం వందల సంఖ్య బేళ్ల తిరస్కరణ

ప్రతి రోజు వేలంలో వందల బేళ్లను వ్యాపారులు తిరస్కరిస్తుంటే రైతులు ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బేళ్లను వెనక్కి తీసుకువెళ్లాలంటే 5 కేజీల తరుగుపోతుందని, రవాణా ఖర్చులతో పాటు శ్రమతో కూడిన కార్యక్రమమని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు వేలం కేంద్రంలో ఐటీసీ గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తుందని, ఎన్నో కంపెనీలు వేలానికి వస్తున్నట్లు చూపిస్తున్నా..46 శాతం కొనుగోళ్లు చేస్తుంది ఐటీసీ మాత్రమేనన్నారు. దీంతో ఆ కంపెనీ నిర్ణయించిన ధరకే రైతు అమ్ముకోవాల్సి ఉందని ఆరోపించారు. రైతుల కష్టాలపై జగనన్న పోరుబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు పోలీసులు అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఢాకా పిచ్చిరెడ్డి మాట్లాడుతూ కూటమిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు పొగాకు రైతుల సమస్యలను పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసులు, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివకుమారి భౌతికకాయానికి దద్దాల నివాళి


శివకుమారి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల

కనిగిరిరూరల్: మండలంలోని నల్లారెడ్డి పల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పర్తి బాలకృష్ణ సతీమణి కొప్పర్తి శివకుమారి మృతి చెందారు. శివకుమారి భౌతికకాయాన్ని శనివారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీటీసీ అట్లా రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల మాలకొండారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆది నారాయణరెడ్డి, ఎం బాలకోటిరెడ్డి, కొప్పర్తి నారాయణరెడ్డి, కొప్పర్తి కొండారెడ్డి, ఆట్లా వెంకట్రామిరెడ్డి, కొపర్తి బాలిరెడ్డి, ఐజాక్, అట్లా పిచ్చిరెడ్డి, మడతల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దశదిన కర్మకు హాజరైన ఆదిమూలపు


లక్ష్మీ నరసింహం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్

టంగుటూరు: అనారోగ్యంతో మృతి చెందిన పొందూరు గ్రామ నాయకుడు రాయండ్ల వెంకట నారాయణ తండ్రి చిన్న లక్ష్మీనరసింహం దశదిన కర్మకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేదరమిట్ల భరత్‌రెడ్డి, ఏలూరి వంశీ, రాయిండ్ల నరసింగారావు, తదితరులు పాల్గొన్నారు.

నాగయ్య భౌతికకాయానికి నివాళులు


నాగయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కాశిరెడ్డి

కనిగిరిరూరల్: విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి, యూనియన్ నాయకుడు పాపబత్తిన నాగేశ్వరరావు(75) మృతి చెందారు. ఈయన భౌతికకాయాన్ని మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, అంబేడ్కర్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాలగురవయ్యలతో పాటు పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. పాపబత్తిని నాగయ్య మృతికి సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వివిధ సంఘాల నాయకులు యర్రజాల బాల నారాయణ, శాంతరాజు, వెలుగొండయ్య, కొటికర్ల బాదుర్లా, దుమ్ము వెంకటయ్య, కొండ్రు ప్రసాద్, పాపబత్తిన నాగేశ్వరరావు, దమ్మువెంకటేష్, దమ్ము కేశవులు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రూపశ్రీ

కనిగిరిరూరల్: కనిగిరి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో పోష్ చట్టంపై న్యాయవాదులకు, పారాలీగల్ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి. రూపశ్రీ మాట్లాడుతూ పోష్ చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా పని ప్రదేశంలో మహిళలకు, సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించవచ్చన్నారు. ఈ చట్టం అన్ని రకాల పని ప్రదేశాలకు వర్తిస్తోందని తెలిపారు. పోష్ చట్టం ప్రకారం ఏదైనా నిబంధనను ఉల్లంఘించినా.. లేదా ఉల్లంఘించడానికి ప్రయత్నించినా.. గరిష్ఠంగా రూ.50 వేల వరకు జరిమాన విధిస్తారన్నారు. చట్టంలోని వివిధ సెక్షన్ల గురించి వివరించారు. పోష్ చట్టం గురించి న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదుల గుమస్తాలు, పారాలీగల్ వలంటీర్లు, న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాలు


విశిష్ట అలంకరణలో గంగమ్మ తల్లి మూల విగ్రహమూర్తి


గంగమ్మతల్లి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): గంగమ్మతల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం రెండవరోజు ముద్దలపోలు క్రామం నిర్వహించారు. అనంతరం గావు, రాయభారము కార్యక్రమాలు నిర్వహించారు. గంగమ్మతల్లి మూలవిగ్రహమూర్తికి, ఉత్సవమూర్తి అమ్మవారికి, బొల్లావులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో అమ్మవారి మూల విగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమపూజ చేశారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం బండ్లు, పొంగళ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

రాజా హిందూస్థాన్ నిధి లిమిటెడ్ బ్యాంకు ప్రారంభం


బ్యాంకు పాస్‌బుక్ చూపిస్తున్న బ్యాంకు అధికారులు

సింగరాయకొండ: స్థానిక ప్రశాంతి థియేటర్ ఎదురుగా రాజా హిందూస్థాన్ నిధి లిమిటెడ్ బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ బాషా తెలిపారు. బ్యాంకు డిల్లీ చీఫ్ ఫైనాన్సియల్ అధికారి బోయపాటి బాలు, డిల్లీ చార్టర్డ్ అకౌంటెంట్ గగన్‌దీప్‌సింగ్, లీగల్ అడ్వైజర్ ఓ శ్రీనివాసరావు, డైరెక్టర్ అండ్ జీఎం టి.యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

దేవాలయ రూమ్‌లకు వేలం

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయం ఆవరణలో రూమ్‌లు నిర్మించుకుని వ్యాపారం చేసుకునే హక్కును కల్పించేందుకు శనివారం దేవాలయశాఖ అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహించారు. స్థానిక జనార్దనస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ వేలం పాటలో పలువురు వ్యాపారులు పాల్గొని రూమ్‌లు దక్కించుకున్నారు. వేలం పాట ద్వారా ఆలయానికి నెలకు రూ 2.84 లక్షల ఆదాయం రానున్నట్లు దేవాలయ అధికారులు తెలిపారు. వేలం ద్వారా రూమ్‌లు దక్కించుకున్న వారికి త్వరలో వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డీసీ శ్రీనివాస్‌చౌదరి, ఆలయ ఈఓ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు): ఉపాధి హామీ పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి పండ్లతోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ నాయక్ తెలిపారు. పండ్లతోటల పెంపకంకోసం నిమ్మ, బత్తాయి, మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్ వంటివి సాగు చేసుకోవచ్చన్నారు. విధిగా జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 ఎకరాలలోపు పొలం కలిగి ఉండాలని తెలిపారు. ఈ పథకం కింద ఆయా పంటలు వేసుకున్న వారికి ఎకరాకు మూడేళ్లకు కలిపి పంటనుబట్టి సుమారు రు.లక్ష దాకా చెల్లిస్తామన్నారు. తోటపెంచుకునే రైతులకు వారి కుటుంబానికి కేటాయించిన 100 రోజులు వారి మొక్కలు సంరక్షణ చేసుకున్నందుకు వారికే చెల్లిస్తారన్నారు. ఇందులో సబ్సిడీ ఏమీ లేదని పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేవారు వారి భూమికి చెందిన పాస్‌బుక్, అడంగల్, సన్న, చిన్నకారు రైతు ధ్రువీకరణ పత్రంతో ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా గాని ఏపీఓను సంప్రదించి దరఖాస్తుచేసుకోవాలన్నారు.

ముగిసిన గంధ మహోత్సవం


దర్గా వద్ద పూజల్లో చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: మండలంలోని నందనమారెళ్లలో నాగూర్ మీరా స్వామి గంధ మహోత్సవం వైభవంగా సాగింది. శ్రవారం రాత్రి ప్రారంభమైన ఉరుసు మహోత్సవ వేడుకలు శనివారం విశిష్ట పూజలతో ముగిసింది. ఉరుసు సందర్భంగా హజరత్ వారి దర్గాను విద్యుత్ దీప పూల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి జెండాను గ్రామంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ విశిష్ట పూజలు చేశారు. మాజీ కౌన్సిలర్ సయ్యద్ నాయబ్ రసూల్, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, పలుకూరి భాస్కర్, ఎస్‌కే రహిమాన్, ఇమామ్, రసూల్, బాషా, మీరావలి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చెత్త తొలగించండి


ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని చెత్త కుప్పలు

సింగరాయకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను శనివారం ఒంగోలు ఆర్ఎం సత్యన్నారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. బస్టాండ్‌లో బస్సులు బయటకు వెళ్లే మార్గంలో చెత్త కుప్పలు ఉండటాన్ని ఆయన కంట్రోలర్ కోటేశ్వరరావును ప్రశ్నించారు. దీంతో అక్కడి ప్రయాణికులు మాట్లాడుతూ బస్టాండు సమీపంలోని దుకాణాల వారు చెత్తను తీసుకుని వచ్చి ఆవరణలో వేస్తున్నారని తెలిపారు. బస్టాండ్ సమీపంలోని వైన్ షాపు సిబ్బంది షాపులో మద్యం సేవించిన గ్లాసులు, వాటర్‌బాటిల్స్, మద్యం బాటిల్స్ తెచ్చి పడేస్తున్నారని తెలిపారు. పంచాయతీ అధికారులకు చెప్పి చెత్తను తొలగించేలా చూడాలని కంట్రోలర్ కోటేశ్వరరావును ఆదేశించారు. తరువాత పంచాయతీ కార్యదర్శి జగదీష్‌తో సమస్యను విన్నవించగా ఆయన తన సిబ్బందిని పంపి డోజర్ సహాయంతో చెత్తను దూరంగా నెట్టించారు.

ముగిసిన నాల్గవ రౌండ్ పొగాకు వేలం


కొండపిలో వేలం


టంగుటూరులో పొగాకు వేలం

కొండపి: పొగాకు నాల్గవ రౌండ్ వేలం శనివారంతో ముగిసిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 722 బేళ్లను వేలానికి తీసుకురాగా 574 బేళ్లను కొనుగోలు చేసి 148 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సరాసరి ధర రూ.255.06గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: పొగాకు అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం ఎం నిడమానూరు క్లస్టర్ గ్రామానికి చెందిన రైతులు 443 బేళ్లను తీసుకురాగా 382 బేళ్లను కొనుగోలు చేసి 61 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.205, సరాసరి రూ.247.35గా నమోదైంది. వేలంలో 23 కంపెనీలు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: కనిగిరి పొగాకు బోర్డులో శనివారం జరిగిన వేలంలో 116 బేళ్ల తిరస్కరణ అయ్యాయి. మాచవరం క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 413 బేళ్లు రాగా.. అందులో 297 బేళ్లు కొనుగోలు చేసి 116 బేళ్లు నో్బ్రిడ్ అయ్యాయి. పొగాకు బేళ్ల గరిష్ఠ ధర కేజీ రూ. 280 పలకగా, కనిష్ఠ ధర రూ. 200, సరాసరి ధర రూ.254 పలికినట్లు వేలం నిర్వాహణాధికారి కోటేశ్వరరావు తెలిపారు.

ప్రజలకు సంకటంగా ట్రాఫిక్


సీఎస్‌పురం, కనిగిరి రోడ్ సెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

పామూరు: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తూ సంకటంగా మారుతోంది. దీనికి ప్రధాన కారణం ప్రధాన, అంతర్గత రోడ్లకు ఇరువైపునా ఉన్న దుకాణాల నిర్వాహకులు పోటీపడి రోడ్డుపక్కన స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించి దుకాణాలను రోడ్డువైపుకు పెట్టుకోవడమే. రోడ్లను ఆక్రమించి దుకాణాలు పెడుతుంటే ఆర్అండ్‌బీ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పామూరుకు నిత్యం నెల్లూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కనిగిరి, కందుకూరు, చీరాల, విజయవాడ, గవర్నర్‌పేట డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులతో పాటు తెలంగాణకు చెందిన బస్‌లు, ప్రైవేట్ ట్రావెల్స్ సుమారు 140 వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో వేలల్లో ప్రయాణికులు పామూరు నుంచే ప్రయాణం చేస్తారు. వీటికి తోడు ఆటోలు, ద్విచక్రవాహనాలు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చేపట్టే చర్యలు మాత్రం నామమాత్రమే. దీంతో నిత్యం కనిగిరిరోడ్డు, సీఎస్‌పురం రోడ్డు, విరువూరు రోడ్డు, కందుకూరురోడ్డు, పూలమార్కెట్ సెంటర్‌లలో తరుచూ ట్రాఫిక్ జామై ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. తక్షణం ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ, పోలీస్ అధికారులు ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.